# ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్



జెండా ఊపి రన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ చైతన్యారెడ్డి

కామారెడ్డి, జూన్ 19 : తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఆదేశానుసారం కామారెడ్డి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఒలింపిక్ డే రన్‌ను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్పీ చైతన్యారెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత పనులు ఉన్నా.. ప్రతిరోజూ వ్యాయామం, రన్నింగ్ వంటి శారీరక శ్రమ చేయాలన్నారు. ఈ ర్యాలీ జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల నుంచి నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్ మీదుగా ఇందిరాగాంధీ స్టేడియం వరకు కొనసాగింది. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఆర్డీవో వీణ, డీఈవో రాజు, జిల్లా క్రీడల అధికారి జగన్నాథం, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, ఒలింపిక్ డే రన్ కమిటీ కన్వీనర్ కరుణాకర్ రెడ్డి, కో కన్వీనర్ రంగా వెంకటేశ్వర్ గౌడ్, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, ఆయా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 110 ఫోన్ల రికవరీ



మాట్లాడుతున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

**ఎస్పీ రాజేశ్ చంద్ర**

కామారెడ్డి, జూన్ 19 : జిల్లాలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 110 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోగొట్టుకున్న, చోరీకి గురైన 110 మొబైల్ ఫోన్లను (సుమారు రూ.16 లక్షలు) రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు చెప్పారు. సెల్‌ఫోన్ పోయినా.. చోరీకి గురైనా.. ఆందోళన చెందవద్దని, సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని అన్నారు. మొబైల్ రికవరీలో రాష్ట్రంలోని జిల్లాల్లో కమిషనరేట్లను మినహాయిస్తే కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. ఇప్పటివరకు 3,263 మొబైల్ ఫోన్లు రికవరీ చేశామన్నారు. ఫోన్ పోయిన వెంటనే www.ceir.gov.inలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్ల రికవరీ కోసం ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఒక ఆర్ఎస్ఐ 10 మంది కానిస్టేబుళ్లతో ప్రత్యేక టీం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 10 రోజుల్లో ఈ టీం సిబ్బంది 110 ఫోన్లు రికవరీ చేశారని తెలిపారు. ఈ టీం సభ్యులను ఎస్పీ అభినందించారు. ఇప్పటి వరకు రికవరీ చేసిన ఫోన్ల వివరాలను బాధితులకు తెలియజేస్తామని, వారు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఆర్ఎస్సై బాలరాజ్ 8712686114 ఫోన్‌కు సంబంధించిన వివరాలు తెలియజేసి తీసుకెళ్లాలని సూచించారు.

## గంప గోవర్ధన్‌కు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ



గంప గోవర్ధన్‌తో బీఆర్ఎస్ నాయకులు

మాచారెడ్డి, జూన్ 19 : కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకుంటున్నారు. విషయం తెలుసుకున్న భవానీపేట, పోతారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లోని గంప గోవర్ధన్ నివాసంలో గురువారం కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో భవానీపేట మాజీ ఉపసర్పంచ్ రమేశ్‌గౌడ్, పైడాకుల రాములు తదితరులు ఉన్నారు.

## వ్యక్తిగత శుభ్రతతోనే వ్యాధులు దూరం

బాన్సువాడ రూరల్, జూన్ 19 : వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం అవుతాయని ఏఎన్ఎం అనురాధ కొయ్యగుట్ట తండా గ్రామస్తులకు సూచించారు. గురువారం ఆశ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ జ్వరం, ఇతర వ్యాధులతో బాధ పడుతున్నవారి వివరాలను సేకరించారు. ఆమె వెంట ఆశ కార్యకర్త సక్కుబాయి ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ

బాన్సువాడ రూరల్, జూన్ 19 : బాన్సువాడ మండలంలోని సంగోజీపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిమ్యానాయక్ తండా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి గ్రామపెద్దలు గురువారం భూమిపూజ చేశారు. ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు కొలతలు ఇచ్చారు. లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో నాగభూషణం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## 'దోస్త్' అడ్మిషన్ల ప్రక్రియ పొడిగింపు

కామారెడ్డి, జూన్ 19 : డిగ్రీ ప్రవేశాల ప్రక్రియను ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలను మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని అన్నారు.

## రూఫ్ టాప్ పనులు ప్రారంభం

భిక్కనూరు, జూన్ 19 : టీయూ సౌత్ క్యాంపస్‌లో డీఆర్డీవో ప్రాజెక్టు డైరెక్టర్ సురేందర్ రూఫ్‌టాప్ పనులు ఎన్ఆర్ఈజీఎస్ సహకారంతో గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్, ఏపీవో రాధిక, తిరుపతి, లక్ష్మీనారాయణ, అధ్యాపకులు ప్రతిజ్ఞ, హాస్టల్ వార్డెన్ యాలాద్రి , నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ మరమ్మతు పనుల పరిశీలన

బాన్సువాడ, జూన్ 19 : పట్టణంలో పాత స్టేట్ బ్యాంకు సమీపంలో కొనసాగుతున్న డ్రైనేజీ మరమ్మతు పనులను రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ గురువారం పరిశీలించారు. ఐదు రోజులుగా కొనసాగుతున్న పనులను ఆయన మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజుతో కలిసి పరిశీలించారు.

## కుల సంఘాల భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

భిక్కనూరు, జూన్ 19 : మండలంలోని జంగంపల్లి గ్రామంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి వివిధ కుల సంఘాల భవనాలు, అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అరుణతార, మండల అధ్యక్షుడు రమేశ్, మండల ప్రధాన కార్యదర్శి తిర్మలేశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు నరేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వర్కర్లకు జీతాలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

కామారెడ్డి, జూన్ 19 : జిల్లా కేంద్రంలోని ప్రభ్వు దవాఖానలో ఏఐటీయూసీ అనుబంధ సంఘం మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బాలరాజు మాట్లాడుతూ.. జిల్లాలో పలు ప్రభుత్వ దవాఖానల్లోని మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్లకు ఐదు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో వర్కర్లకు రెండు నెలల నుంచి జీతాలు చెల్లించలేదన్నారు. జీతాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలు ప్రారంభమయ్యాయని, జీతాలులేక పిల్లలకు పుస్తకాలు, నిత్యావసర సరుకులు, అద్దె చెల్లించలేదన్నారు. కనీసం సుప్రీం కోర్టు జీవో ప్రకారం రూ.18 వేలు, రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్మికులను ప్రభుత్వం నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. జూలై 9వ తేదీన చేపట్టనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు దశరథ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి రఫీక్, నాయకులు సందీప్, ప్రవీణ్, లక్ష్మి, యూనియన్ నాయకులు, మెడికల్ కార్మికులు పాల్గొన్నారు.

## బాలుడిపై వీధికుక్కల దాడి

రాజంపేట్, జూన్ 19 : మండల కేంద్రంలో గురువారం సాయంత్రం 6.30 గంటలకు ట్యూషన్‌కు వెళ్లేందుకు ఇంటి నుంచి బయటికి వచ్చిన నిద్విత్‌పై వీధి కుక్కలు దాడి చేశాయి. కాలుపై కరవడంతో గాయాలయ్యాయి. తల్లి సంతోష కాపాడేందుకు రాగా ఆమెపై కూడా దాడి చేసేందుకు యత్నించాయి. బాలుడిని చికిత్స కోసం జిల్లా దవాఖానకు తరలించారు. వీధి కుక్కల నియంత్రణకు అధికాలు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పోలీస్ స్టేషన్ తనిఖీ

బీబీపేట్(దోమకొండ) జూన్ 19 : దోమకొండలోని పోలీస్‌స్టేషన్ సీఐ సంపత్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, కచ్చితంగా మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్సై ప్రవంతికి సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలో సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ సంపత్‌కుమార్

# యోగా మహోత్సవానికి తరలిరావాలి



కామారెడ్డిలో మాట్లాడుతున్న గుడిమెట్ పీఠాధిపతి సద్గురు మహదేవ్ స్వామి



బాన్సువాడలో యోగా కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

కామారెడ్డి, జూన్ 19 : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21వ తేదీ శనివారం యోగా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని గుడిమెట్ పీఠాధిపతి సద్గురు మహదేవ్ స్వామి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యోగా గురువు బండి రాములుతో కలిసి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని మెహర్‌బాబా గార్డెన్‌లో ఉదయం 10.40 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**పాస్టర్ శ్యాముల్‌పై చర్యలు తీసుకోవాలి..**

ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో పాస్టర్ శ్యాముల్ రాజు పూలు పెట్టుకునే మహిళలపై చేసిన వ్యాఖ్యలను గుడిమెట్ పీఠాధిపతి సద్గురు మహదేవ్ మహరాజ్ స్వామి ఖండించారు. పూలు పెట్టుకునే మహిళలు వేశ్యలు అనేలా మాట్లాడడం ఆయన అవివేకానికి నిదర్శనమని అన్నారు. ఇలాంటి వారిపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**యోగాతో సంపూర్ణ ఆరోగ్యం**

బాన్సువాడ, జూన్ 19 : యోగా సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. బాన్సువాడలో ఆయూష్ విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన యోగాసాధన అవగాహన కార్యక్రమంలో సబ్ కలెక్టర్, సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా ప్రశిక్షకులు వోట్లం శ్రీనివాస్‌గౌడ్ యోగాసనాలు చేయించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడారు. పట్టణంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించే యోగా దినోత్సవాన్ని ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం యోగాసనాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్ర మంలో తహసీల్దార్ వరప్రసాద్, రెవెన్యూ సిబ్బంది అంజు, అశోక్, టీఎన్జీవోస్ ఉద్యోగ సంఘం నాయకుడు శ్రీనివాస్, డీఎల్పీవో సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత తాగునీటి సరఫరా

లింగంపేట(తాడ్వాయి), జూన్ 19: తాడ్వాయి మండ లం బ్రహ్మజివాడి గ్రామంలో కలుషిత తాగునీరు సరఫరా అవుతున్నదని గ్రామస్తులు తెలిపారు. నెల రోజుల క్రితం గ్రామంలో తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో తాగునీరు కలుషితం అవుతున్నదని, వర్షాలు కురుస్తున్నందున కలుషిత నీరు తాగడం వల్ల రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకేజీలకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

లింగంపేట, జూన్ 19 : మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన బీరప్ప అనే రైతుకు చెందిన పశువు విద్యుదాఘాతంతో మృతిచెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో మేత కోసం వెళ్లిన ఎద్దుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్ తగలడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందింది. విషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించగా ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఎద్దు ధర రూ.70వేలు ఉంటుందని, ట్రాన్స్‌కో అధికారులు స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

## దివ్యాంగులకు ఫిజియోథెరపీ

ఎల్లారెడ్డి రూరల్/మాచారెడ్డి, జూన్ 19: ఎల్లారెడ్డి పట్టణంలోని భవిత భవనంలో గురువారం దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ అరుణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 8 మంది చిన్నారులు పాల్గొన్నారు. వారికి వ్యాయామ వైద్యం చేయడంతోపాటు వారి కుటుంబ సభ్యులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ వెంకటేశం, చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మాచారెడ్డిలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో దేవేందర్‌రావు, ఫిజియోథెరపిస్ట్ నవీన్, ఐఈఆర్పీ మంజుల తదితరులు పాల్గొన్నారు.

## కుల వృత్తులను కాపాడాలని వినతి

బిచ్కుంద, జూన్ 19 : కులవృత్తులను కాపాడాలంటూ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు గురువారం మున్సిపల్ కమిషనర్ హయ్యూమ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుల వృత్తిలో ఇతరులు వచ్చి పని చేయడంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామన్నారు. తమ కులస్తులు కాకుండా ఇతర కులస్తులకు తమ వృత్తి పరంగా లైసెన్సులు జారీ చేయకుండా తమ కుల వృత్తిని కాపాడాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నర్సింహులు, నారాయణ, అనిల్, రాము, పండు, నరేశ్, విఠల్, దతదితరులున్నారు.

## ఆరోగ్యవంతమైన జీవనం కోసం కృషి చేయాలి

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 19: పరిశుభ్రమైన పరిసరాలు, ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ సూచించారు. గురువారం వంద రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలోని పలు వార్డుల్లో తిరుగుతూ పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

**చదువుకొనే స్కూల్ వద్దు..**

## చదువుకునే పాఠశాల ముద్దు

నాగిరెడ్డిపేట, జూన్19: మనకు చదువును కొనుక్కొనే పాఠశాల వద్దని.. కేవలం చదువులు చెప్పే పాఠశాలలు కావాలని గ్రామ మాజీ సర్పంచ్ సాయిలు అన్నారు. మండలంలోని జప్తిజాన్కంపల్లి ప్రభుత్వ పాఠశాలలో బడిబాట ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు హెచ్ఎం అనసూయతో కలిసి బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామస్తుల సహకారంతో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకువస్తామని ఉపాధ్యాయులు తెలిపారు.

# రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



ఎల్లారెడ్డి గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులతో యోగా చేయిస్తున్న ట్రెయినర్ సుజాత

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 19: జూన్ 21వ తేదీ శనివారం ఎల్లారెడ్డి పట్టణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 'ఒక భూమి – ఒక ఆరోగ్యం కోసం యోగా' అనే నినాదంతో దశాబ్ది వేడుకలను నిర్వహించనున్నట్లు యోగాచార్యులు సుజాత నాగరాజ్‌గౌడ్ తెలిపారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్‌స్కూల్, గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో యోగా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు యోగా ప్రాధాన్యతను వివరించారు. యోగా చేస్తే శరీరం ఎంత దృఢంగా మారుతుందో తెలిపారు. అనంతరం వారితో యోగా చేయించారు. అనునిత్యం ఉదయం సమయంలో చేసే ప్రాణాయామం, యోగాను వారు విద్యార్థులతో చేయించి, వివరించారు. జూన్ 21వ తేదీన పట్టణంలోని బాలాగౌడ్ ఫంక్షన్‌హాల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దశాబ్ది వేడుకలను చేపడుతున్నామని, పట్టణానికి చెందిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయూష్‌శాఖ డాక్టర్ శ్వేత, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గాంధీ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రతి రోజూ యోగా చేస్తే రోగాలు దరి చేరవు..**

బిచ్కుంద, జూన్ 19 : ప్రతి రోజూ యోగాసనాలు చేయడం ద్వారా రోగాలు, రుగ్మతలు దరి చేరవని యోగా గురువు సంజీవ్ జుబ్రే అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బిచ్కుందలో పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులతో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు యోగాపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనోహర్, రచ్చ శివకాంత్, నాగ్‌నాథ్, శంకర్, సత్యవీర్, బిచ్కుంద సహజసిద్ధ యోగా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## మెడికల్ ఆఫీసర్‌పై దాడిని నిరసిస్తూ ధర్నా



రామారెడ్డి పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

రామారెడ్డి, జూన్19 : రామారెడ్డి పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సురేశ్‌పై ఈ నెల 17న రాత్రి కామారెడ్డిలోని కల్కినగర్‌లో ఆయన ఇంటికి వెళ్లి ఆయనపై విచక్షణా రహితంగా దుర్భాషలాడుతూ ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. గతంలో రామారెడ్డి పీహెచ్‌సీలో విధులు నిర్వహించి, ప్రస్తుతం దేవునిపల్లి పీహెచ్‌సీలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్న రాజు, నిజాంసాగర్ పీహెచ్‌సీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సుభాష్ వ్యక్తిగత కారణాలతో ఆయనపై దాడి చేశారు. ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. దాడిని ఖండిస్తూ నిరసనగా వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గురువారం రామారెడ్డి పీహెచ్‌సీ ఎదుట వైద్య సిబ్బంది ధర్నా నిర్వహించారు. వారిని విధుల నుంచి తొలగించాలని, ఇకముందు వైద్య సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రామారెడ్డి పీహెచ్‌సీ సిబ్బందితో పాటు అన్నారం పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## కందకాలు తవ్విన అటవీశాఖ అధికారులు



కందకాలు తవ్వుతున్న అటవీశాఖ అధికారులు

లింగంపేట, జూన్ 19: మండలంలోని మాలోత్ తండా శివారులోని అటవీ ప్రాంతంలో పోలీస్ పహారా మధ్య గురువారం కందకాలను తవ్వినట్లు రేంజ్ అధికారి ఓంకార్ తెలిపారు. తండా శివారులోని 732 కంపార్టుమెంట్‌లో అటవీ భూమి ఆక్రమణకు గురి కాకుండా ఉండేందుకు హద్దుల్లో అటవీ శాఖ అధికారులు కందకాలు తవ్వినట్లు చెప్పారు. తండాకు చెందిన పలువురు రైతులు అడ్డుకునే ప్రయత్నాలు చేయగా పోలీసుల సహకారంతో వారిని సముదాయించి కందకాలను తవ్వినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి రేంజ్ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన అధికారులు, స్థానిక పోలీసులు, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

## నర్సరీలో మొక్కలను పరిశీలించిన డీఎల్పీవో



నాగిరెడ్డిపేట గ్రామ నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్పీవో సురేందర్

నాగిరెడ్డిపేట, జూన్ 19: నాగిరెడ్డిపేట గ్రామ పంచాయతీని గురువారం మండల ప్రత్యేక అధికారి, డీఎల్పీవో సురేందర్ సందర్శించారు. గ్రామంలోని నర్సరీలో మొక్కలను పరిశీలించారు. ప్రధాన వీధుల్లో తిరిగి పారిశుద్ధ్య పనులను ఎప్పటి కప్పుడూ చేపట్టాలని గ్రామ కార్యదర్శి కార్తీక్‌కు సూచించారు. పైప్‌లైన లీకేజీలు లేకుండా చూసుకొని సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలన్నారు. గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు.

## రైతులనుంచి దరఖాస్తులు స్వీకరించాలి



మోషంపూర్ రెవెన్యూ సదస్సును సందర్శించి మాట్లాడుతున్న రెవెన్యూ కలెక్టర్ విక్టర్

రామారెడ్డి, జూన్ 19 : మండలంలోని మోషంపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును రెవెన్యూ కలెక్టర్ విక్టర్ సందర్శించారు. వచ్చిన దరఖాస్తుల సంఖ్య, ఎటువంటి సమస్యల పై ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని తహసీల్దార్ ఉమలతను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను స్వీకరించాలని, విచారణ అనంతరం వారి సమస్యకు మార్గం చూపాలని సూచించారు. అనంతరం గ్రామంలోని రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి రేషన్ బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ, స్టాక్ వివరాలను డీలర్ ఉమాదేవిని అడిగి తెలుసుకొని ఆమెకు పలు సూచనలు చేశారు. ఆయనతోపాటు ఆర్ఐ రవికాంత్, గ్రామకార్యదర్శి హరిలత, తహసీల్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## పాఠ్య పుస్తకాల పంపిణీ

నాగిరెడ్డిపేట/బాన్సువాడరూరల్/బాన్సువాడ, జూన్ 19: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఎంపీడీవో ప్రభాకర్ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఆయన వెంట గోపాల్‌పేట ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకట్రాం రెడ్డి, కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

బాన్సువాడ మండలంలోని బోర్లం దళితవాడ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, స్కూల్ యూనిఫామ్స్‌ను ఎంఈవో నాగేశ్వర్‌రావు గ్రామపెద్దలతో కలిసి అందజేశారు.హెచ్ఎం సాయిరాం, ఏఎంసీ మాజీ చైర్మన్ నర్సింహులు, దేవేందర్‌రెడ్డి, నాగభూషణం, సావిత్రి, భాగయ్య పాల్గొన్నారు. బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ప్రసన్నలత, ఎస్‌జీటీ ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు నోటు బుక్కులను ఎంఈవో వెంకన్న చేతుల మీదుగా అందజేశారు. బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలను అందజేశారు. ప్రిన్సిపాల్ షేక్ సలాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 19: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కో–ఆర్డినేటర్ శంకరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చేయడానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆగస్టు 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

## జిల్లాస్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థులు



ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 19: జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఎంఈవో రాజులు తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం క్రీడాపాఠశాలలలో 4వ తరగతి ప్రవేశాలకు బాలబాలికలను ఎంపిక చేయనికి క్రీడాపోటీలను నిర్వహించామన్నారు. మండల స్థాయిలో 8మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనగా, అత్యుత్తమ ప్రతిభ కనపరచిన ముగ్గురిని జిల్లాస్థాయిలో జరుగనున్న పోటీలకు ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో మండలస్థాయి వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ చిన్నారులకు కంటి పరీక్షలు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నేత్ర వైద్యుడు

లింగంపేట, జూన్ 19: మండలంలోని పోతాయిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు గురువారం కంటి పరీక్షలు నిర్వహించినట్లు నేత్ర వైద్యుడు హరికిషన్ తెలిపారు. కేంద్రానికి వస్తున్న 74 మంది చిన్నారులకు కంటి పరీక్షలు చేశామన్నారు. చిన్నారులకు నేత్ర సమస్యలు రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందించాల్సిన పౌష్టికాహారంపై వారి తల్లిదండ్రులకు వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు నిఖత్, ఫార్మాసిస్టు ఉమ, ఏఎన్ఎం స్వప్న, అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీలో చిన్నారులకు అక్షరాభ్యసం..**

పెద్దకొడప్‌గల్, జూన్ 19 : మండలంలోని బూర్గుపల్లి, పోచారం గ్రామాల్లో అమ్మమాట..అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం, అన్నప్రాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్ వనజ మాట్లాడుతూ చిన్నారులకు ఎగ్ బిర్యానీ అందిస్తున్నామన్నారు. రెండు ఏండ్లు దాటిన పిల్లల పేర్లను ఇంటింటికీ వెళ్లి నమోదు చేసుకుంటామన్నారు. తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు.